# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- తెలుగు కేవలం భాష కాదని.. మన జీవన విధానమని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు.

- దేశీయ పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- అమరావతి క్యాపిటల్ సిటీలో మంత్రులు, అధికారుల నివాస భవనాల పనులు వచ్చే ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి పి.నారాయణ అన్నారు.

- రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులన్నింటిని ప్రభుత్వం పూర్తి చేస్తుందని మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు.

- రైతుల భూ హక్కులు నమోదు చేసి.. వివాదాలకు తావులేకుండా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

====================

ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని సామాజిక మాధ్యమం వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పోస్టు చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఫలితాలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయని, పాలసీ సంస్కరణలతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. దేశీయ పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలవడం ప్రజలకు శుభవార్త అని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కార్యక్రమాల ద్వారా పెట్టుబడిదారులకు వేగవంతమైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రోత్సాహకాల పంపిణీలో పారదర్శకత కోసం ఎస్క్రో ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టామని వెల్లడించారు. రంగాల వారీగా స్పష్టమైన విధానాలు అమల్లోకి తీసుకొచ్చామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల గమ్యస్థానంగా ఎంచుకున్న ఇన్వెస్టర్లకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. పెట్టుబడులు, భాగస్వామ్యాలు, స్థిరమైన వృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టిందని వెల్లడించారు.

=====================

అమరావతి క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల నివాస భవనాల పనులు వచ్చే ఏప్రిల్ నెలలో పూర్తి చేసి అందజేయనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. రాజధాని అమరావతి ప్రాంతంలో మంత్రి ఈరోజు పర్యటించారు. నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ అమరావతిలో మొత్తం 4 వేల 026 భవనాలు, ఫ్లాట్లు నిర్మిస్తున్నామని తెలియజేశారు. వీటిలో బంగ్లాలు కాకుండా.. 3 వేల 850 భవనాలు అపార్ట్‌మెంట్ మోడల్లో నిర్మాణం జరుగుతున్నాయని తెలిపారు.

(వాయిస్ 26 సెకన్లు)

=====================

రైతులు తమ భూమి వివరాలను సులభంగా తెలుసుకునే విధంగా క్యూ ఆర్ కోడ్ కలిగిన ఆధునిక పాస్ పుస్తకాలు ప్రభుత్వ రాజముద్రతో అందిస్తున్నామని రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం మరువాడ గ్రామంలో ఈరోజు నిర్వహించిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. రైతుల భూ హక్కులు స్పష్టంగా నమోదు చేసి, భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఉండేలా ఈ విధానం రూపకల్పన చేశామన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాలలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తోందని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 27 సెకన్లు)

=====================

మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు గుంటూరులో ప్రారంభమయ్యాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలుగు మహాసభలను ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ... మనిషికి పుట్టుకతోనే మాతృబంధం, భాషా బంధం ఏర్పడతాయని తెలిపారు. భాష కేవలం భావవ్యక్తీకరణకు మాత్రమే కాదని, ఒక ప్రపంచాన్ని సృష్టించేంత బలం భాషలో ఉందన్నారు. అధికార వ్యవహారాల్లో తప్పనిసరిగా తెలుగు ఉండాలని, జిల్లా స్థాయి వరకు కోర్టు కార్యకలాపాలు తెలుగులో జరగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. తెలుగు కేవలం భాష కాదని.. మన జీవన విధానమని పేర్కొన్నారు.

విరామం

=====================

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రైల్ రన్‌గా రేపు తొలి వాణిజ్య విమానం దిగనుంది. ఢిల్లీ నుంచి బయలుదేరే ఈ ఎయిర్ ఇండియా విమానం.. ఉదయం 11 గంటలకు పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఇతర విమానయాన శాఖ అధికారులతో రానుంది. ఈ చివరి ట్రయల్ రన్ విజయవంతం అయిన తర్వాత, మే నెల నుండే ఎయిర్ పోర్ట్ నుంచి రాకపోకలు సాగించేందుకు సిద్ధంగా ఉన్న ఇతర విమానయాన సంస్థలతో మంత్రిత్వ శాఖ చర్చలు జరపనుంది.

=====================

హంద్రీనీవా సుజల స్రవంతి మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పూర్తికి అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా జయపురం గ్రామం వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ఫేజ్-2లో భాగంగా రూపొందించిన మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులలో ఆగిపోయిన కంట్రోల్ రూమ్ నంబర్-2ను మంత్రి

ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులన్నింటిని ప్రభుత్వం పూర్తి చేస్తుందని హామీ ఇచ్చారు.

=====================

భారత అభివృద్ధి ప్రస్థానంలో 2025వ సంవత్సరం కీలక అధ్యాయంగా నిలిచింది. ప్రభుత్వ విధానాలు ప్రగతికి బాటలు వేయగా, సంకల్పం క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలను అందించింది. 'సంస్కరణల సంవత్సరం' పేరిట ఆర్థిక రంగంలో భారత్ పురోగతిపై 'ఆకాశవాణి' అందిస్తున్న ప్రత్యేక కథనం…

2025లో సమానత్వం, ఆవిష్కరణలు, సాంకేతికతలో భారత్ సాధించిన పురోగతికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, జిని సూచిక 25.5తో భారత్ ప్రపంచంలో అత్యంత సమాన సమాజాల్లో ఒకటిగా నిలిచింది. చైనా, అమెరికా, జి–7, జి–20 దేశాల కంటే ముందంజలో ఉందని పేర్కొంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) నివేదికలో.. భారత్ లో సామాజిక రక్షణ కవరేజ్ 2015లో 19 శాతం ఉండగా, 2025లో 64.3 శాతానికి పెరిగిందని వెల్లడించింది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు కూడా ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) సంస్థ 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ – UPI' ను ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ వ్యవస్థగా గుర్తించింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా జరిగే లావాదేవీలలో 49 శాతం నిర్వహించిందని తెలిపింది. పేదరిక నిర్మూలనలో కూడా భారత్ విశేష ఫలితాలు సాధించింది. గత దశాబ్దంలో 17 కోట్ల 10 లక్షల మంది అత్యంత పేదరికం నుంచి బయటపడ్డారని నివేదికలు వెల్లడించాయి.

=====================

వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ-రామ్-జీ) పేరిట కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త పథకంపై తిరుపతి జిల్లాలోని ఉపాధి కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడాన్ని వారు స్వాగతించారు. ఉపాధి హామీ కూలీల వేతనాలను కూడా పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై కేంద్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయంతో తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఉపాధి కూలి చంద్రకళ పేర్కొంటూ…

(వాయిస్ 16 సెకన్లు)

=====================

ఈనెల 11, 12, 13వ తేదీలలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ నున్న గండికోట ఉత్సవాలకు త్వరిత గతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. జమ్మలమడుగు నియోజకవర్గం గండికోటలో ఉత్సవాల ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలిచిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గండికోట ఉత్సవాలను జిల్లా పర్యాటక, చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని నలు దిక్కులా చాటేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతాన్ని సాస్కి పథకం ద్వారా 79 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.

=====================

=====================